సాక్షి సంగారెడ్డి


సోమవారం । 13 । అక్టోబర్ । 2025



మత్తు.. చిత్తు

మత్తు పదార్థాల వినియోగం నేడు పల్లెలకు కూడా పాకింది.

వివరాలు 8లో ▸



డెత్ స్పాట్

సంగారెడ్డిలోని మినీ ట్యాంక్‌బండ్ ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది.

వివరాలు 8లో ▸



ఉపాధి కూలీలకు ఈ కేవైసీ

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం ఈ కేవైసీ చేయాలని నిర్ణయించింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఐక్యతతోనే రాజకీయంగా ఎదగాలి



మొగుడంపల్లి సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ఐక్యంగా ఉంటూనే రాజకీయపరంగా ఎదగాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో ఆదివారం బీసీ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 42% రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు పార్టీలకతీతంగా మద్దతు తెలపాలని కోరారు.

ప్రతీబిడ్డకు పోలియో చుక్కలు వేయాలి



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలో ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలియో నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు.

మట్టి అక్రమ రవాణాపై ఫిర్యాదు చేస్తాం

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు అడ్డుకున్న మట్టి రవాణా టిప్పర్లు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ కేంద్ర సమీపంలోని సర్వేనంబర్ 1లో నిబంధనలను బేఖాతరు చేస్తూ అడ్డగోలుగా అక్రమ మట్టి రవాణా సాగుతోందని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. మట్టి తరలిస్తున్న వ్యక్తులతో వాదనలకు దిగారు. మట్టి రవాణాకు సంబంధించి అనుమతులు రెన్యూవల్ కాకుండా యథేచ్ఛగా మట్టిని తరలించడంపై మండిపడ్డారు. అక్రమార్కులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: సదాశివపేట పట్టణంలో ఈనెల 19న జరిగే సీఐటీయూ జిల్లా నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో జరిగిన కిర్బీ పర్మినెంట్, క్యాజువల్ కార్మికుల సమావేశానికి రాజయ్య హాజరై మాట్లాడారు. సీఐటీయూ నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడుతుందన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని జనశక్తి పార్టీ రామ్ విలాస్ లేబర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. భెల్‌కాలనీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చిన నేతలను ఆదివారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి నేతలు తపస్‌ధరం, శాంతను మండల్‌లు తనను మర్యాదపూర్వకంగా కలవడానికి రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

డీసీసీ పదవికి పోటాపోటీ

సుమారు 12 మంది నాయకులు దరఖాస్తులు

- ఈసారి భిన్నంగా ఈ పదవి నియామకం ప్రక్రియ
- ఆశావహులను ఇంటర్వ్యూలు చేసిన పరిశీలకులు
- ఏఐసీసీకి ఆరుగురు పేర్లతో కూడిన జాబితా



ఏఐసీసీ పరిశీలకులకు పత్రం అందజేస్తున్న జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించిన కాంగ్రెస్ పార్టీ డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) అధ్యక్ష పదవి నియామకం ప్రక్రియ ఈసారి కాస్త భిన్నంగా చేపట్టింది. ఈ పదవిని ఆశించిన నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. సంఘటన్ శ్రీజాన్ అభియాన్ కార్యక్రమం పేరుతో ఆదివారం సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో ముఖ్యనేతల సమావేశం నిర్వహించింది. డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు సిజరిట, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పీసీసీ పరిశీలకులు తోట లక్ష్మికాంతరావు, కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు గిరిధర్‌రెడ్డి, ఎం.ఏ.ఫయీం, నాయకులు నీలంమధు, గాలి అనిల్‌కుమార్, పలువురు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం అనంతరం డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించిన నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సుమారు 12 మంది నాయకులు డీసీసీ పోస్టుకోసం దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు దరఖాస్తు ఫారాలను తీసుకున్నారు.

పార్టీ కోసం ఏం చేశారు?

పేరు.. కులం.. ఎన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నారు? పార్టీ కోసం ఏం సేవ చేశారు? ఎన్నికల్లో ఎప్పుడైనా పోటీ చేశావా? గెలిచిన పదవి ఏంటీ? పార్టీ ఆదేశిత కార్యక్రమాలు ఏమేమి చేశావు? వంటి అన్ని అంశాలు డీసీసీ పదవికి సంబంధించిన దరఖాస్తు ఫారంలో ఉన్నాయి. ఈ పదవిని ఆశిస్తున్న నాయకులు ఈనెల 18లోపు ఈ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. దరఖాస్తు చేసుకునేందుకు ముందుకొచ్చిన నాయకులతో ఏఐసీసీ పరిశీలకులు సిజరిట ఒక్కొక్కరితో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా నాయకులతో ఐదారు నిమిషాలు మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులపై జిల్లా ముఖ్య నాయకులతో అభిప్రాయ సేకరణ చేసి ఆరుగురు పేర్లతో కూడిన జాబితాను ఏఐసీసీకి పంపుతామని సిజరిట ప్రకటించారు. ఏఐసీసీ నాయకత్వం ఇందులోంచి ఒక పేరును ప్రకటిస్తుందని తెలిపారు.

అభ్యర్థుల ఎంపికలో డీసీసీ కీలకం: మంత్రి దామోదర

2025 నాటికి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం నిర్ణయం తీసుకుంది. పార్టీలో అన్ని వర్గాల నేతలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించాకే డీసీసీ అధ్యక్ష పదవిని ప్రకటిస్తాం. రానున్న రోజుల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో డీసీసీ అధ్యక్షులు కీలకం అవుతారు. తర్వాత బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ, గ్రామపార్టీ అధ్యక్షుల నియామకం ఉంటుంది. రాజకీయ వ్యవహారాల కమిటీ నియామకం కూడా త్వరలోనే పూర్తవుతుంది.

అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాం: సిజరిట, ఏఐసీసీ పరిశీలకులు

డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తాం.

రసాయన నిల్వల పట్టివేత

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో స్థానిక పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమకు చెందిన రసాయన నిల్వలను డ్రగ్ కంట్రోల్, నార్కోటిక్ విభాగం అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్, నార్కోటిక్ శాఖకు చెందిన సుమారు 20 మంది అధికారులు ఆదివారం రాత్రి ఫంక్షన్ హాల్‌లో దాడులు నిర్వహించగా భారీగా అక్రమంగా రసాయనాలు నిల్వ చేసినట్లు గుర్తించారు. కడపటి వార్తలందేసరికి బొల్లారం పోలీసుల బందోబస్తులో ఈ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి.

పోలియోను నిర్మూలిద్దాం

- 97.11% పూర్తయిన పల్స్ పోలియో
- కలెక్టర్ ప్రావీణ్య
- పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి: టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య. చిత్రంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డి/సంగారెడ్డి జోన్: జిల్లాలో 97.11% పల్స్ పోలియో కార్యక్రమం పూర్తయినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. అన్ని శాఖల అధికారులతో కలిసి మొదటిరోజు 1,86,147 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డితో కలిసి పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమీన్‌పూర్‌లో పోలియో చుక్కల స్టాక్ లేదనటంలో వాస్తవం లేదని ఆమె స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అంచనా వేసిన దానికంటే 1,500 డోసుల పోలియో చుక్కల మందు పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో సరఫరా చేసినట్లు తెలిపారు. గతంలో కంటే ఈసారి 60 కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి పల్స్ పోలియో చుక్కలు వేసి లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. నిర్మలారెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పల్స్ పోలియో చుక్కలు, చిన్నపిల్లల వ్యాక్సినేషన్ కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు యథావిధిగా ప్రజావాణి

కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సమస్యలను సంబంధిత అధికారులకు అందజేయడానికి ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావచ్చని కలెక్టర్ సూచించారు.

ఇందిరా జయంతికి చీరల పంపిణీ

- జిల్లాకు 50% చీరలే సరఫరా
- దసరాకు నెరవేరని లక్ష్యం
- జిల్లాలో 18,848 గ్రూపులు



ఇందిరమ్మ చీరలు

నారాయణఖేడ్: బతుకమ్మ, దసరా పండగనాటికి మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేయాలని నిర్ణయించిన చీరల పంపిణీ కార్యక్రమం వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే ఈ చీరల పంపిణీని దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి రోజైన నవంబర్ 19న తిరిగి పునఃప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండగనాటికే చీరలను పంపిణీ చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయన్న విమర్శల నేపథ్యంలో ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బతుకమ్మ పండుగకల్లా అత్యంత నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించుకుంది. చేనేత కార్మికులతో చీరలను ప్రత్యేకంగా తయారీ చేయించారు. అయితే బతుకమ్మ పండుగ నాటికి చీరలు సిద్ధం కాకపోవడంతో పంపిణీ సాధ్యం కాకపోవడంతో దసరా నాటికి పంపిణీ చేయాలని నిర్ణయించారు. అప్పటికీ సరిపడా చీరల తయారుకాకపోవడంతో చీరల పంపిణీని ప్రభుత్వం వాయిదా వేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15 నాటికి చీరల తయారీని పూర్తి చేయించి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ఇటీవల చీరల తయారీ, పంపిణీపై సమీక్షించారు.

జిల్లాలో 1.94లక్షల చీరలు అవసరం

జిల్లాలో 18,848 గ్రూపుల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు 1.94లక్షల మంది ఉన్నారు. వీరికి ఒక్కో చీర చొప్పున పంపిణీ చేయనున్నారు. అందుకుగాను 1.94లక్షల చీరలు అవసరం అవుతాయి. ఇప్పటివరకు జిల్లాకు 50% చీరలు మాత్రమే సరఫరా కాగా గోడౌన్లలో అధికారులు సిద్ధం చేశారు. మిగతా 50% చీరలు రావాల్సి ఉంది.

సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో..

మహిళా సంఘాలకు నాయకత్వం వహించే సెర్ప్, మెప్మా సంస్థలు ఈ చీరలను పంపిణీ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో అందించనున్నారు. మహిళల కోసం 6.5 మీటర్లు, వృద్ధుల కోసం 9మీటర్ల చీరలను రూపొందిస్తున్నారు.

ఇందిరమ్మ పేర పంపిణీ

ఈ చీరలను ఇందిరమ్మ చీరల పథకం పేర పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. చీరల తయారీలో నాణ్యత విషయంలో రాజీ లేకుండా ఆరోపణలకు అవకాశం లేకుండా సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో మగ్గాలపై తయారు చేసిన నాణ్యమైన చీరలను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో చీరలను ప్రభుత్వం నేయించింది. రూ.800 విలువ గల ఒక్కో చీరను పంపిణీ చేయాలని నిర్ణయించారు.

బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్



ఆందోళన చేస్తున్న బీసీ సంఘం నేతలు

సంగారెడ్డి: బీసీలకు అన్యాయం చేస్తే సహించేదిలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ హెచ్చరించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డిలో ధర్నా, రాస్తా రోకో చేశారు. ఐబీ నుంచి ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండ్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుగౌడ్ మాట్లాడుతూ..బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టుకు వెళ్లిన వారు తిరిగి పునరాలోచన చేసి కేసు వాపసు తీసుకోవాలని హితవు పలికారు. రాజ్యాధికారం అగ్రవర్ణాల చేతిలో ఉన్నంతకాలం బహుజనులు బానిసలుగానే ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున పాటిల్, ముఖ్య సలహాదారులు చంద్రయ్యస్వామి, శాలివాహన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి సాయిలు ,పుల్లంగారి సురేందర్,కొండల్ ,తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దు రోడ్డుకు మరమ్మతులు

కల్హేర్–పిట్లం మధ్య రాకపోకలు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

కల్హేర్(నారాయణఖేడ్): భారీ వర్షాల కారణంగా జిల్లా సరిహద్దులో కల్హేర్–పిట్లం మండల కేంద్రాల మధ్య రోడ్డు కోతకు గురైన రోడ్డును ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల 10న 'కోతల రోడ్డుకు మరమ్మతులేవి?'శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు, అధికార పక్షం నాయకులు స్పందించారు. ఇటీవల కుండపోతగా కురిసిన వర్షం కారణంగా కల్హేర్ సమీపంలో మహారాజ్ వాగు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించింది. ఫలితంగా వరద ప్రభవంతో రోడ్డు కోతకు గురైంది. కల్హేర్ నుంచి కామారెడ్డి జిల్లా పిట్లం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. పిట్లం, బాన్సువాడ, కామారెడ్డి, బోధన్, నిజామాబాద్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు దెబ్బతిన్న చోట్ల ట్రాక్టర్లు, జేసీబీ సహాయంతో మొరం మట్టి వేసి చదును చేశారు. ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు చేయడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. రోడ్డు మరమ్మతు పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు దేవదాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, బేగరి సాయిలు, కిష్టారెడ్డి పరిశీలించారు.



కోతకు గురైన కల్హేర్–పిట్లం రోడ్డు మధ్యలో ముమ్మరంగా సాగుతున్న మరమ్మతు పనులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీజేపీ యువ నాయకురాలు చంటి దేవిక

సంగారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి బీజేపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ జిల్లా యువ నాయకురాలు చంటి దేవిక ధీమా వ్యక్తం చేశారు. చౌటకూర్ మండలం కోర్పోలు గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో బీజేపీ నాయకుడు, న్యాయవాది చంటి ప్రభుతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం మండల కేంద్రమైన చౌటకూర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారన్నారు.



సంగారెడ్డి ఎంఎన్నార్ చౌరస్తా వద్ద విరిగిపోయిన హైదరాబాద్-నర్సాపూర్ సూచిక బోర్డు



వాహనాలు తగలటంతో పక్కకు వంగిపోయిన బోర్డు

బోర్డులు మార్చండి సారూ!

సంగారెడ్డి నుంచి అందోల్, నర్సాపూర్, హైదరాబాద్, నారాయణఖేడ్ వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు పూర్తిగా పాడయ్యాయి. కొన్ని చోట్ల అక్షరాలు, దూరాన్ని సూచించే నంబర్లు చెరిగిపోయాయి. ప్రమాదాలు జరుగు స్థలాలు, వేగపరిమితిని చూపించే బోర్డుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అర్ధరాత్రి వేళ ప్రయాణించే వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. చాలా ఏళ్ల క్రితమే ఇవి పాడైనప్పటికీ అధికారులు మాత్రం బోర్డులు మార్చటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



వేగపరిమితిని చూపించే బోర్డు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



మొక్కలు పెరిగి కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డు

రైతన్న ఇంట సిరుల పంట

వర్షాకాలంలో భారీగా వరి సేద్యం

- జిల్లాలో 1,51,511 ఎకరాల్లో సాగు
- 37.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
- కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు
- నష్టపరిహారం ఇవ్వాలని రైతుల వినతి



కల్హేర్ శివారులో సాగులో వరి పొలాలు

కల్హేర్(నారాయణఖేడ్): రైతన్న ఇంట సిరుల పంట పండనుంది. వర్షాకాలంలో భారీ వర్షాలతో జిల్లాలోని సింగూర్, నల్లవాగు ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. రైతులు ఎక్కువగా వరి సాగు చేశారు. జిల్లాలో 1,51,511 ఎకరాల్లో వరి సాగులో ఉంది. ఖేడ్ డివిజన్‌లో 42,468 ఎకరాల్లో వరి సాగులో ఉందని వ్యవసాయ శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద 6 వేల ఎకరాల్లో వరి వేశారు. చెరువులు, కుంటలు, వ్యవసాయ బోరు బావుల వద్ద వరి సాగు చేయడంతో పల్లెలో ఎటుచూసినా వ్యవసాయ భూములు పచ్చదనంతో కోనసీమ అందాలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో ఉంది. రైతులు వరి కోతలు మొదలుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే మనూర్, నాగల్‌గిద్ద, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. జిల్లాలో 37.87 లక్షల మెట్రిక్ క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ కలిపి 207 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

పంట కోత దశలో ఉంది



పదెకరాల్లో వరి సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఉంది. వరి కోతలు మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నా. వాగు దగ్గర వరదతో కొంత పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– పట్నుతి కిష్టారెడ్డి, రైతు, కల్హేర్

వర్షాలతో గుబులు

వానకాలంలో మొదట వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఆలస్యంగా వర్షాలు కురవడంతో రైతన్నలకు 'కాలం'కలిసొచ్చింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నల్లవాగు ప్రాజెక్టు నిండి అలుగు పారింది. చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. బోరు బావుల్లో భూగర్భజలం పెరిగింది. అయితే పంట చేతికొచ్చేదశలో వర్షాలు పడితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని భయాందోళనలో ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ప్రవహించి కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట్ మండలాల్లో వరి పంట నేలవాలిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఇంకా కొన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కాగా, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దేశ ఐక్యతకు పాటుపడతాం

మెదక్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ రాఘవులు



పథ్ సంచాలన్‌లో యువకులు

పటాన్‌చెరు టౌన్: దేశ ధర్మ ఐక్యతకు పాటుపడే విధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పనిచేస్తుందని మెదక్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ రాఘవులు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ నుంచి పలు వీధుల గుండా పథ్ సంచాలన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వందేళ్ల కిందట ఐదు మంది స్వయం సేవకులతో ప్రారంభమై నేడు లక్షలాది శాఖలతోపాటు కోట్లాదిమంది స్వయం సేవకులతో ఉందన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పథ్ సంచాలన్‌లో పాల్గొన్న యువతను అభినందించారు.

డ్రిప్ పరికరాలు ధ్వంసం



ధ్వంసం చేసిన పరికరాలను చూపిస్తున్న బాధితులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆయిల్ పామ్ తోటలో దుండగులు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆదివారం చిన్నకోడూరులో జరిగింది. గ్రామానికి చెందిన కర్నే శ్రీలత, కర్నే సత్తవ్వలు మూడున్నర ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారు. గత నెలలో ఒకసారి మొక్కలు తొలగించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శనివారం అర్ధరాత్రి తమ తోటలోని డ్రిప్ పరికరాలు పూర్తిగా ధ్వంసం చేశారని వాపోయారు. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

ముగ్గురు అరెస్టు, 10 మంది పరారీ



పట్టుబడిన ముగ్గురు జూదరులు, నగదు

వెల్దుర్తి(తూప్రాన్): పేకాట స్థావరంపై పోలీసులు మెరుపుదాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. తూప్రాన్ సీఐ రంగకృష్ణ వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు వెల్దుర్తి ఎస్ఐ రాజు సిబ్బందితో దామరంచ అటవీప్రాంతంలో దాడిచేయగా కొందరు వ్యక్తులు అక్కడ జూదం ఆడుతున్నారు. పోలీసులను గమనించి పదిమంది అక్కడి నుంచి పరారయ్యారు. కాగా ముగ్గురు జూదరులు పట్టుబడ్డారు. ఘటనా స్థలం నుంచి 5 మోటార్ సైకిళ్లు, 8 మొబైల్ ఫోన్లతో పాటు రూ. 3,29,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ కలప పట్టివేత

ట్రాక్టర్ సీజ్



కలపతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు

తూప్రాన్: అక్రమంగా తరలిస్తున్న కలపతో పాటు ట్రాక్టర్‌ను ఆదివారం అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. వివరాలు ఇలా... పట్టణంలోని భారత్ పెట్రోల్ బంకు వెనుక అక్రమంగా చెట్లు నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఈ విషయం గుర్తించిన అటవీ శాఖ అధికారులు అనుమతులు లేకుండా చెట్లను నరకడం చట్టరీత్యా నేరమని సదరు వ్యక్తికి జరిమానతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

యశ్వంత్‌రావు పాటిల్‌కు అవార్డు



అవార్డును అందుకున్న యశ్వంత్‌రావు పాటిల్ దంపతులు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ బసవదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యశ్వంత్‌రావు పాటిల్‌కు బసవ పీఠం వారు శరణ కాయకరత్న అవార్డును ప్రదానం చేశారు. కర్నాటక రాష్ట్రంలోని బసవ కల్యాణ్‌లో జరుగుతున్న 24వ కల్యాణ పర్వ సమ్మేళనంలో ఆయనకు బసవ ధర్మపీఠం మహిళా జగద్గురు గంగామాతాజీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాటిల్‌ను రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, జహీరాబాద్ అధ్యక్షుడు శరణప్ప తదితరులు అభినందించారు.

మత్తు.. చిత్తు

గంజాయి మత్తులో జోగుతున్న యువత



అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత, కార్మికులను చిత్తు చేస్తున్నాయి. గతంలో పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన మత్తు పదార్థాల వినియోగం క్రమక్రమంగా పల్లెలకు పాకింది. దానికి బానిసలవుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. జిల్లాలోని ప్రధానంగా పరిశ్రమలతోపాటు రైల్వేస్టేషన్లు, జాతీయ రహదారిపై ఉన్న పలు దాబాలు ఇందుకు అడ్డాలుగా మారుతున్నాయి.

– రామాయంపేట(మెదక్)

- గ్రామాలకు పాకిన వ్యసనం
- అడ్డాలుగా పరిశ్రమలు, రైల్వేస్టేషన్లు, దాబాలు

మహారాష్ట్ర, బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో జిల్లాలోని పలు పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వీరు తమ సొంత రాష్ట్రాలకు వెళ్లి వస్తున్న క్రమంలో అక్కడి నుంచే గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రైళ్లలో తీసుకొస్తున్నట్లు పోలీస్‌శాఖ అనుమానిస్తుంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖతో పాటు పోలీస్‌శాఖ పరిశ్రమలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవల పలుమార్లు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై ..

జిల్లా మీదుగా వెళుతున్న 44వ నంబర్ జాతీయ రహదారి 11 రాష్ట్రాల మీదుగా వెళ్తుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాలనుంచి జాతీయ రహదారి మీదుగా గంజాయి అక్రమ సరఫరా పెద్ద ఎత్తున కొనసాగుతున్నట్లు సమాచారం. గత ఏడాది పెద్ద మొత్తంలో గంజాయి తరలిస్తున్న కారు రామాయంపేటవద్ద ప్రమాదానికి గురికాగా ఈ విషయం బయటపడింది. జాతీయ రహదారిపై ఎక్కడో ఒకచోట తరచూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు పట్టుబడుతున్నాయి.

రైల్వే స్టేషన్ల నుంచి రవాణా!

ప్రధానంగా రైళ్ల ద్వారానే గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా అవుతున్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రధానంగా మెదక్, అక్కన్నపేట, మీర్జాపల్లి, వడియారం రైల్వేస్టేషన్లలో వీటి వినియోగం ఇటీవల పెరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి వస్తున్న యాచకులు, వారి అనుచరులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగిస్తూ తరచూ గొడవలకు దిగుతున్నారు. గంజాయి దొరకని పరిస్థితుల్లో వారు వైట్‌నర్, వాహనాల టైర్ల పంక్చర్ కోసం వినియోగించే ద్రావణం బోనోఫిక్స్, ఫెవికిక్ వాడుతున్నట్లు సమాచారం. సాక్షి ప్రతినిధి అక్కన్నపేట స్టేషన్‌ను సందర్శించిన సమయంలోనే యాచకులిద్దరూ జేబురుమాలులో బోనోఫిక్స్ ద్రావణం వేసుకుని యాదృచ్ఛికంగా కంటపడ్డారు. వారు రుమాలులో వేసుకున్న ద్రావణాన్ని ముక్కుదగ్గర ఉంచుకొని మత్తులో తేలడం కనిపించింది.



అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో మత్తు పదార్థాలు వినియోగిస్తున్న యాచకులు

మత్తుకు దూరంగా ఉండాలి



గంజాయి, ఇతర మత్తు పదార్థాల సరఫరా, వినియోగం నేరం. యువత ఈ విషయంపై జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే భవిష్యత్తు నాశనమవుతుంది. మత్తు పదార్థాల వినియోగం ముందుగా సరదాగా ప్రారంభమై అలవాటుగా మారిపోతుంది. ఈ క్రమంలో పెడ్లర్‌గా మారే అవకాశాలున్నాయి. ఈ మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. కఠిన చర్యలు తప్పవు.

– నరేందర్‌గౌడ్, డీఎస్పీ, తూప్రాన్

డెత్ స్పాట్..

ఆత్మహత్యలకు కేరాఫ్ చెరువు



మహబూబ్ సాగర్ చెరువు కట్టపై కనిపించని హెచ్చరిక బోర్డులు

- పది నెలల్లో 15 మంది బలవన్మరణం
- సీసీ కెమెరాలు, పర్యవేక్షణ కరువు
- భద్రత చర్యలు చేపట్టని అధికారులు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో చూడగల ప్రదేశాల్లో మహబూబ్ సాగర్ (మినీ ట్యాంక్ బండ్) ఒకటి. అది ఒక అప్పటి మాట. ఇప్పుడు ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా, డెత్ స్పాట్‌గా మారింది. ఇటీవల ఈ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి.

చెరువు చుట్టూ సరైన రక్షణ కవచం లేక ఆత్మహత్య చేసుకునే వారు కట్టపై నుంచి చెరువులోకి దూకుతున్నారు. సందర్శకుల భద్రతతో పాటు ఆత్మహత్యలను కట్టడి చేసేందుకు ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణ అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఆత్మహత్యలకు స్పాట్‌గా మారింది. తాజాగా ఈనెల 11న గుర్తుతెలియని యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఈ ఏడాది మార్చి17న మెదక్ జిల్లాకు చెందిన తల్లి, కూతుర్లు ఆత్మహత్య చేసుకున్నారు. తర్వాత మృతదేహాలు నీటిలో తేలాయి. గడిచిన 10 నెలల్లో గుర్తుతెలియని మృతదేహాలు దాదాపు 10 నుంచి 15మంది చెరువులో తేలడంతో పోలీసులు వాటిని బయటకు తీసి కేసులు నమోదు చేశారు.

భద్రత కరువు..

గత ప్రభుత్వాలు ఈ చెరువుని (మినీ ట్యాంక్ బండ్) అభివృద్ధి పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయంలో పోలీసుల పెట్రోలింగ్ వాహనాలు ఇటు వైపు రాకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మొదట్లో ఏఎస్ఐ స్థాయి అధికారితో పాటు మూడు నుంచి ఐదు మంది సిబ్బంది నిత్యం విధుల్లో ఉండేవారు. ప్రస్తుతం ఒక్క కానిస్టేబుల్ కూడా విధుల్లో లేకపోవడం గమనార్హం.

కనిపించని హెచ్చరిక బోర్డులు

చెరువును చూడటానికి నిత్యం పట్టణ ప్రజలతో పాటు, చుట్టు ప్రక్కల గ్రామల నుంచి దాదాపు 50 నుంచి 150 మంది సందర్శకులు వస్తుంటారు. చెరువు కట్టపై పలు చోట్ల కనిపించని హెచ్చరిక బోర్డులు, ప్రమాదకర స్థాయి నీటి మట్టం లోతు , రెండు వైపులా కంచెలు లేవు. దీంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మద్యం తాగిన అనంతరం చెరువులో ప్రమాదకరంగా చేపలు పట్టబోయి, ఈత రాక తమ ప్రాణాలు కోల్పోతున్నారు.

రక్షణ చర్యలు చేపడతాం



చెరువు కట్టపై భద్రత చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి మున్సిపాలిటీ, పలు శాఖల అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తాం. రాత్రి సమయంలో భద్రత సిబ్బందితో పాటు, పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఉండేలా చూస్తాం. పాదచారులు, సందర్శకులు ఎప్పుడు పడితే అప్పుడు రాకుండా సమయ పాలన బోర్డు ఏర్పాటు చేస్తాం.

– రమేశ్, పట్టణ సీఐ

హరేకృష్ణ మందిరాన్ని నిర్మిస్తాం

హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి విభీషణ్ ప్రభు



మాట్లాడుతున్న విభీషణ్ ప్రభు

జహీరాబాద్: జహీరాబాద్‌లో అక్షయపాత్ర భవనంతో పాటు హరేకృష్ణ మందిరాన్ని నిర్మించనున్నట్లు కందిలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి విభీషణ్ ప్రభు తెలిపారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో 176వ నగర సంకీర్తన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయా నిర్మాణాలకు తమ బృంద సభ్యులు స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా అనాథలకు ఉచితంగా, పేద ప్రజలకు ఐదు రూపాయలకే రుచికరమైన భోజనం అందిస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు సైతం మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలో దామోదర మాసం సందర్భంగా దీపారాధన చేశారు. అలాగే హుగ్గెల్లి గ్రామంలో 141వ పల్లె సంకీర్తన నిర్వహించారు.

ఎక్సైజ్ అధికారులే దాడి చేశారు

- చల్లగిద్ద తండా గిరిజనుల ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు



అధికారుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వడిత్యా మోహన్

నారాయణఖేడ్: గంజాయి సాగు చేస్తున్నారనే నెపంతో తమ తండాపై ఎక్సైజ్ అధికారులు దాడిచేయడంతోపాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని మండలంలోని చల్లగిద్ద తండా గిరిజనులు ఆరోపించారు. కొందరిని ఇష్టానుసారం కొట్టారని వాపోయారు. సివిల్ డ్రెస్‌లో వచ్చిన వారు ఎవరో తెలీదని, తండాలోని ఇండ్లల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. కాగా ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని తండాకు చెందిన కోమటిబాయి, చావుళీబాయి, సునీత, భూలిబాయి, రేణుక, సునీత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వడిత్యా మోహన్ తనను ఎక్సైజ్ అధికారులు కొట్టారన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఇంట్లోకి ప్రవేశించి పెట్టెలు ధ్వంసం చేసి చెరుకు నరికేందుకు తెచ్చుకున్న అడ్వాన్స్ రూ.2లక్షలు, పట్టా పాసుపుస్తకాలు సైతం తీసుకెళ్లారని ఆరోపించారు.

కిరాణా షాప్‌నకు వెళ్తున్నానని చెప్పి..

యువతి అదృశ్యం



పింకీ బాయి

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తీకి చెందిన పింకీబాయి (23) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం కిరాణా షాప్‌నకు వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతి స్థిమితం లేని మహిళ



బాలమణి

వర్గల్(గజ్వేల్): మండలంలోని మీనాజీపేటకు చెందిన మహిళ అదృశ్యమైంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మంకని చిన్నబాలనర్సింహులు భార్య బాలమణి(55)కి కొద్దిరోజుల నుంచి మతిస్థిమితం లేదు. మూడు రోజుల క్రితం సాయంత్రం ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆమె కోసం వెతికినా దొరకలేదు.

కల్హేర్‌లో యువతి..



కోట శంకరమ్మ

కల్హేర్(నారాయణఖేడ్): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. సిర్గాపూర్ ఎస్ఐ మహేశ్‌కుమార్ వివరాల ప్రకారం... మండలంలోని అంతర్‌గాం గ్రామానికి చెందిన కోట శంకరమ్మ ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్



మాట్లాడుతున్న రజినీకాంత్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కొన్నేండ్లుగా ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తమ చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు అవుతున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కట్టుకలిసిగా భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేసి ప్రభుత్వం మెడలు వంచైనా సరే బకాయిలు విడుదల చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మహేశ్, రాజేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, సహాయ కార్యదర్శి అర్జున్, జిల్లా కమిటీ సభ్యులు స్వరాజ్, లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



మాజీ సైనికుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: సైనికుల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక విపంచి ఆడిటోరియంలో జరిగిన మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం, అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు మాజీ సైనికుల సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర ప్రాంతాల్లో సైనికులు ఉద్యోగాలు చేస్తుంటే, ఇక్కడ వారి పిల్లలు నాన్ లోకల్ అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం వీర సైనికుల కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ప్రతినిధులు జోజి, మల్లిక్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 267మందికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే హరీశ్ రావు పంపిణీ చేసి మాట్లాడారు. మార్కెట్‌లో రైతులు పండించిన మక్కలను కొనుగోలు చేసే దిక్కు లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



కాలిబూడిదైన గుడిసె వద్ద బాధితురాలు రజిత, పిల్లలు

తూప్రాన్: ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని వెంకటరత్నాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గొడెల్లి రాజు, రజిత దంపతులు పూరిగుడిసెలో నివాసం ఉంటున్నారు. ఆదివారం దంపతులిద్దరూ కూలీ పనులకు వెళ్లారు. పిల్లలు ఇంటివద్దే ఉన్నారు. పాఠశాలకు సెలవు దినం కావడంతో పక్కింట్లో ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు గుడిసెలో నుంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన చుట్టు పక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలోని బియ్యం, బట్టలు తదితర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ కుటుంబం ఉన్న నివాసం కోల్పోయి రోడ్డున పడింది. ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బస్సులో నుంచి దూకిన బాలికకు గాయాలు

జోగిపేట(అందోల్): ఆధార్‌కార్డు తల్లికి ఇచ్చేందుకు ఓ బాలిక కదులుతున్న బస్సులో నుంచి కిందకి దూకింది. వివరాలు ఇలా... పుల్కల్ మండలం మిన్పూర్ గ్రామానికి చెందిన అక్షిత తన చెల్లెలు, తల్లితో కలిసి ఆదివారం సంత కావడంతో జోగిపేటకు వచ్చారు. పప్పు దినుసులు కొనుగోలు చేసిన తర్వాత బస్టాండ్‌కు వచ్చి సంగారెడ్డి వెళ్లేందుకు అక్షిత తన సోదరితో కలిసి బస్సు ఎక్కారు. తల్లి ఆమె బంధువులతో కలిసి కలిసి తర్వాత వస్తానని చెప్పింది. ఈ క్రమంలో తల్లి ఆధార్ కార్డు తన వద్దే ఉందని గుర్తించి వెంటనే బస్సులో నుంచి కిందకు దూకేసింది.దీంతో ఆమెకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాగానే ఉన్నట్లు ఆమె సోదరుడు తెలిపారు.కాగా అక్షిత గ్రామంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

చెరువులోపడి వృద్ధుడు మృతి



రాజయ్య

హవేళిఘణాపూర్(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఫరీద్‌పూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చింతల రాజయ్య శివారులోని చెరువు సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి కాలుజారి అందులో పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం అందించగా వారు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు.కాగా అతడికి మతిస్థిమితం లేదని తెలిపారు.

కుళ్లిన స్థితిలో యువకుడి శవం..

నారాయణఖేడ్: కుళ్లిన స్థితిలో యువకుడి శవం చెరువులో లభ్యమైంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన సిర్గాపూర్ ఆంజనేయులు (32)వారం క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలు పట్టేందుకు శివారులో గల కుబులం చెరువు వద్దకు వెళ్లగా శవమై తేలి కనిపించాడు. మృతుడి భార్య ఇతనితో దూరంగా ఉంటుందని, కొన్ని రోజులుగా మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. మృతుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వేల్పుల సంపత్

కోహెడ(హుస్నాబాద్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా... మండల కేంద్రానికి చెందిన వేల్పుల సంపత్(39) చెప్పుల షాపు నిర్వహణకు, ఓ ఫైనాన్స్ ద్వారా ఆటో కొనుగోలు చేసి సుమారు రూ. 30 లక్షలు అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో ఈ నెల 1న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లిలో అత్తగారి ఇంట్లో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. కాగా మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఆర్పీఎస్ మండలాధ్యక్షుడు మంద మల్లేశం కోరారు.

స్కూటీని ఢీకొట్టిన బస్సు

అక్కడికక్కడే వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి వివరాల ప్రకారం ... పటాన్‌చెరు జేపీ కాలనీకి చెందిన చంద్రశేఖర రావు (56) పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం నైట్ డ్యూటీకి తన స్కూటీపై వెళుతున్నాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు శివారు మంజీర డిగ్రీ కళాశాల సమీపంలోకి రాగానే పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న కర్ణాటక బస్సు స్కూటీని ఢీకొట్టింది.దీంతో తీవ్ర గాయాలై చంద్రశేఖర రావు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆటో ఢీకొట్టడంతో ..

పటాన్‌చెరు టౌన్: ఆటో ఢీ కొట్టడంతో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలానికి చెందిన మడపర్తి మల్లయ్య (67) రెండు రోజుల క్రితం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి రుద్రారంలో ఉండే కుమారుడి ఇంటికి వచ్చాడు. తిరిగి శనివారం రాత్రి రుద్రారం నుంచి మలక్‌పేటలో ఉండే కూతురు దీక్ష ఇంటికి వెళ్తానని బయలుదేరాడు. ఈ క్రమంలో ఆటోస్టాండ్‌లో ఆటో కోసం చూస్తుండగా సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడ్ని పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు..

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన మూడ సాయిలు(24) మెదక్ వైపు నుంచి వస్తుండగా కోంటూర్ వెంచర్‌లో నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని బైక్ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే సమయంలో హైదరాబాద్ వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు, కాంగ్రెస్ నాయకులు చిట్కుల్ మహిపాల్‌రెడ్డి వాహనం దిగి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబులెన్సులో మెదక్ ఆస్పత్రికి తరలించారు.